సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం ၊ 2 ၊ మార్చి ၊ 2025



సోమశిలలో 58.946 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 54.946 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,680 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.87,650
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,940
3 శాతం జీఎస్టీతో	రూ.8,178
సవర (8 గ్రా)	రూ.65,424

గరిష్టం/కనిష్టం
33.9 /23.7

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆదివారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 63 శాతంగా నమోదైంది.



న్యూస్‌రీల్

కనిపించిన 'నెలవంక'

- పవిత్ర రంజాన్ మాసం ఆరంభం
- సంబరాలు చేసుకున్న ముస్లింలు

నెల్లూరు(బృందావనం): ఆకాశంలో శనివారం సాయం సంధ్యవేళ నెలవంక కనిపించడంతో రంజాన్ నెల ఆరంభమైంది. నెలవంకను వీక్షించిన అనంతరం మతపెద్దల సూచనలతో ముస్లింలు రాత్రి 8.45 గంటలకు తరావీ నమాజు ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక 'దువా' (ప్రార్థన) చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని 'రంజాన్' శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మిఠాయిలు పంచుకుని, బాణసంచా పేల్చి ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకున్నారు. రంజాన్ మాసంలో నెల రోజుల పాటు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో గడుపుతారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు సంప్రదాయంగా నియమ నిబంధనలను పాటిస్తూ కఠోర ఉపవాసంతో దీక్షలో ఉంటారు. ప్రతి రోజు వేకువజామున 'సహరి'తో ఉపవాసం ఆరంభించి సాయంత్రం సంధ్యవేళ 'ఇఫ్తారి'తో ఉపవాసం దీక్ష విరమణ పరిపాటి.

ఎఫ్ఆర్ఎస్ హాజరు వేయకపోతే కఠిన చర్యలు

- డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పద్మావతి



మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి, పక్కన డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత తదితరులు

నెల్లూరు(అర్బన్): ముఖ ఆధారిత హాజరు (ఎఫ్ఆర్ఎస్) వేయని వైద్యశాఖ అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ కె.పద్మావతి పేర్కొన్నారు. విజయవాడ నుంచి వచ్చిన ఆమె శనివారం నగరంలోని వైద్యశాఖ కార్యాలయంలోని డీఎంహెచ్ఓ చాంబర్‌లో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల్లో సమయపాలన పాటించని వారిపైన కూడా చర్యలు తప్పవన్నారు. ప్రతి అధికారి, ఉద్యోగి వారు విధులు నిర్వర్తించే ప్రాంతంలోనే తప్పనిసరిగా నివాసముండాలని సూచించారు. ఐపీ, ఓపీ, ఆస్పత్రులలో ప్రసవాలు, ల్యాబ్ టెస్టులు, ఐయుసీడీల ఆధారంగా సీహెచ్‌సీలకు గ్రేడింగ్ విధానం అమలు చేస్తున్నామన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలి, డీఐఓ డా.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

నుడా ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

- జిల్లా కలెక్టర్ ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ నుడా కమిటీ సభ్యులు, అధికారులకు సూచించారు. శనివారం వేదాయపాలెం గాంధీనగర్‌లోని కార్యాలయంలో నుడా అథారిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆనంద్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్ సూర్యతేజ, అథారిటీ సభ్యులు హాజరయ్యారు. నుడా కార్యకలాపాల కోసం సిబ్బంది నియామకం, లేఅవుట్ల అభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులు అజెండాలో ప్రధాన అంశాలుగా పొందుపరిచారు. పలు అంశాలను సభ్యుల సమక్షంలో కలెక్టర్ సమీక్షించి ఆమోదించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నగరంతో పాటు జిల్లాలోని పలు పట్టణాలు, పంచాయతీల్లో నుడా ఆధ్వర్యంలో లేఅవుట్లు వేసి తక్కువ ధరకు ఇంటి స్థలాలను ప్రజలకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. వైస్‌చైర్మన్ మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ మాట్లాడుతూ నుడా ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తూ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, ఆర్అండ్‌బీ ఎస్ఈలు దేశ్‌నాయక్, గంగాధర్, పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్, ఆర్డీఓ వంశీకృష్ణ, ముఖ్య ప్రణాళికాధికారి కె హిమబిందు, నుడా సెక్రటరీ పెంచలరెడ్డి, ప్రణాళికాధికారి ఎం హిమబిందు పాల్గొన్నారు.

బెట్టింగ్ జాడ్యం

- జిల్లాలో జోరుగా క్రికెట్ పందేలు
- ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న వైనం
- ఉచ్చులో చిక్కుకుంటున్న మహిళలు
- అప్పులపాలై దొంగతనాలకు
- తాజాగా దొరికిన ఇద్దరు మహిళా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు
- అయినా దృష్టి సారించని పోలీసులు

సాక్షిప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ మళ్లీ జడలు విప్పుకుంది. ప్రధాన పట్టణాల నుంచి పల్లెల వరకు ఈ జాడ్యం పాకింది. ప్రస్తుతం ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగిస్తోంది. బుకీలకు కాసులు కురిపిస్తోంది. ప్రజలు బెట్టింగ్ ఉచ్చులో పడి చేతులు కాల్చుకుంటున్నారు. ఒకరిద్దరు పందేలు గెల్చుకుంటున్నా, ఓడిపోయేవారే కోకొల్లలు. బెట్టింగ్‌లో సర్వం కోల్పోయి అప్పుల బాధలు తాళలేక కొందరు ఆత్మహత్యలు చేసుకుంటుండగా మరికొందరు నేరాలకు తెగబడుతున్నారు. బెట్టింగ్‌ను పూర్తిస్థాయిలో కట్టడి చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో జిల్లాలో జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి.

బెట్టింగ్ విధానాల్లో మార్పులు

క్రికెట్ ఫార్మాట్‌లో వస్తున్న మార్పుల తరహాలోనే బెట్టింగ్ విధానాల్లోనూ మార్పులు వస్తున్నాయి. గతంలో మ్యాచ్ టూ మ్యాచ్ మాత్రమే బెట్టింగ్‌లు కాసేవారు. ప్రస్తుతం టాస్ ఎవరు గెలుస్తారు? గెలిచిన జట్టు ఎంత స్కోర్ చేస్తుంది? ప్రతి బంతికి, ఓవర్‌కు ఎన్ని పరుగులు వస్తాయి? ఫలానా బ్యాట్స్‌మెన్ ఎన్ని పరుగులు చేస్తారు? బౌలర్ ఎన్ని వికెట్లు తీస్తారు? ఇలా ప్రతి అంశంపై బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ల ద్వారా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. సెల్‌ఫోన్‌లతోనే బెట్టింగ్‌లు జరుగుతున్నాయి.

ఈమె రష్మశ్రీ (పేరు మార్చాం). నెల్లూరు కిసాన్‌నగర్‌లో నివాసముంటున్నారు. ప్రభుత్వ వైద్యశాఖ కార్యాలయంలో ఎఫ్ఎన్ఓగా పనిచేస్తోంది. పదేళ్ల క్రితం వివాహం జరిగింది. క్రికెట్ బెట్టింగ్‌లు, రమ్మీతో పాటు పలు ఆన్‌లైన్ గేములు ఆడుతుంది. అంతేకాకుండా పేటీఎం, ఫోన్‌పే తదితర వాటి ద్వారా ఆన్‌లైన్‌లో సుమారు రూ.5 లక్షల వరకు రుణం, అలాగే స్నేహితుల వద్ద మరో రూ.5 లక్షలు అప్పు తీసుకుని ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడుతూ రూ.10 నుంచి రూ.20 లక్షల వరకు అప్పులపాలైంది. ఈఎంఐలు చెల్లించలేక అప్పులు ఎలా తీర్చాలో తెలియక కోవూరులో రెండు రోజుల క్రితం చైన్ స్నాచింగ్ చేస్తూ దొరికిపోయింది.

ఈమె పేరు జానకి (పేరు మార్చాం). నెల్లూరు మూలాపేటలో నివాసం. కోవూరు మండలంలోని ఓ వ్యక్తితో వివాహమైంది. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. కరోనా సమయంలో విజయవాడలోని ఎఫ్ఎన్ఓ ట్రైనింగ్ పూర్తి చేసి 2022లో కోవూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవుట్ సోర్సింగ్ ఎఫ్ఎన్ఓగా చేరారు. కరోనా సమయంలో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో కొందరితో స్నేహం కుదిరి వారి ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు అలవాటు చేసుకుంది. అప్పటి నుంచి ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ అప్పులు తీర్చేందుకు దొంగతనం చేస్తూ అడ్డంగా దొరికిపోయింది.



టీవీల్లో చూసే వాటి కంటే రెండు, మూడు నిమిషాల ముందుగానే ప్రత్యేక యాప్‌ల్లో మ్యాచ్ వివరాలు తెలిసిపోతుండటం గమనార్హం. గతంలో నగరాలు, పట్టణాలకే పరిమితమైన బెట్టింగ్‌లు నేడు గ్రామీణ ప్రాంతాలకు పాకాయి. సులువుగా డబ్బులు సంపాదించే అవకాశం ఉందంటూ బుకీలు ఎరవేయడంతో యువత, విద్యార్థులు, కూలీలు, కార్మికులు, వ్యాపారస్తులతో పాటు వివిధ రంగాల్లోని వారు బెట్టింగ్ మాఫియా వలలో చిక్కుకుంటున్నారు. బెట్టింగ్ వ్యసనాలకు బానిసై రూ.లక్షల్లో అప్పులు చేసి మరీ బెట్టింగ్‌లు కాస్తున్నారు. బెట్టింగ్‌ల్లో నష్టపోయి అప్పులను తీర్చలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇంకొందరు దొంగతనాలకు పాల్పడుతూ వచ్చిన సొమ్ముతో అప్పులు తీర్చి తిరిగి బెట్టింగ్‌లు కాస్తూనే ఉన్నారు.

ఎక్కడ చూసినా క్రికెట్ పందేలే

చాపకింద నీరులా బెట్టింగ్ భూతం విస్తరిస్తూ ప్రజల జీవితాలను, కుటుంబాలను ఛిద్రం చేస్తున్నా పోలీసులు అటువైపుగా దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. పోలీసులకు చిక్కకుండా పకడ్బందీగా క్రికెట్ బెట్టింగ్ సాగుతోంది. నగరంలోని బార్లు, హోటల్స్, అపార్ట్‌మెంట్‌లు, వ్యాపార సంస్థలు ఎక్కడ చూసినా క్రికెట్ పందేలే. ఈ జాడ్యం వందలాది కుటుంబాల్లో చిచ్చురేపుతోంది. మార్చి 9వ తేదీన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ముగుస్తున్నా.., మార్చి 22 నుంచి మే 25వ తేదీ వరకు ఐపీఎల్ జరగనుంది. ఈసీజన్‌లో ఎంతమంది ఆర్థికంగా చితికిపోతారో? ఎంతమంది ఆత్మహత్యలు చేసుకుంటారో? ఎన్ని కుటుంబాలు వీధినపడనున్నాయో తలచుకుంటేనే భయం కలుగుతోంది. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి బెట్టింగ్‌పై ఉక్కుపాదం మోపాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఉదాహరణలు ఇవిగో..

- నెల్లూరు నగరానికి చెందిన ఇద్దరు యువకులు సులువుగా డబ్బు సంపాదించాలని బెట్టింగ్‌లు ఎంచుకున్నారు. చిన్న చిన్న మొత్తాలతో పందేలు కాయడం.. వారు ఎంచుకున్న జట్లు గెలుపొందడంతో డబ్బు వచ్చింది. దీంతో తమ తాహతుకు మించి అప్పులు చేసి మరీ రూ.లక్షల్లో బెట్టింగ్‌లు కాశారు. కథ అడ్డం తిరగడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయి బైక్ దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కి జైలుపాలయ్యారు.
- వనంతోపు సెంటర్‌కు చెందిన ఓ యువకుడు తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీతో సరదాగా బెట్టింగ్‌లు కాయడం ప్రారంభించాడు. అది వ్యసనంగా మారిపోవడంతో తెలిసిన వారివద్ద అప్పులు చేశాడు. తల్లిదండ్రులు కొని ఇచ్చిన బైక్‌ను కుదువపెట్టి మరీ బెట్టింగ్‌లు కాశాడు. అందులో నష్టాలు రావడంతో బైక్ దొంగతనం జరిగిందని తల్లిదండ్రులను నమ్మించే ప్రయత్నం చేశాడు. చివరకు వారు గట్టిగా నిలదీయడంతో బెట్టింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.
- బుచ్చిరెడ్డిపాళెం చెందిన శ్రీనివాసులు బెట్టింగ్‌ల్లో నష్టపోయాడు. బెట్టింగ్‌రాయుళ్ల ఒత్తిడితో రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈవిషయం తెలుసుకున్న అతని భార్య యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎంతో సంతోషంగా ఉండే ఆ కుటుంబాన్ని బెట్టింగ్ భూతం కబళించింది. ఇలా జిల్లాలో అనేకమంది నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్నారు.



మహిళలకూ సోకిన వ్యసనం

పురుషులకు సమానంగా తామేమి తీసిపోమంటూ మహిళలూ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడడం ఆందోళన కల్గించే విషయం. ఇంటి అవసరాలకు భర్త ఇచ్చిన దాంట్లో మిగుల్చుకుని కొందరు, ఉద్యోగం చేస్తూ వచ్చిన నగదుతో మరికొందరు బెట్టింగ్‌లు కాస్తున్నారు. కొందరు రూ.లక్షల్లో బెట్టింగులు కాస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు. బయటకు చెప్పుకోలేక సొంత ఇళ్లలోనే దొంగతనాలు చేస్తున్న వారు కొందరుండగా, బలవన్మరణాలకు పాల్పడుతున్న వారు లేకపోలేదు. ఇంకొందరు నేరాలకు పాల్పడుతున్నారు. తాజాగా కోవూరులో ఓ వృద్ధురాలు తన మనవడ్ని ఇంటి ముందు ఆడిస్తుండగా ఇద్దరు మహిళలు స్కూటీపై అక్కడికి వచ్చారు. వృద్ధురాలి కళ్లలో కారం కొట్టి ఆమె మెడలోని రెండున్నర సవర్ల బంగారు సరుడును తెంపుకెళ్లేందుకు యత్నించారు. వృద్ధురాలు పెద్దగా కేకలు వేయడంతో కుటుంబసభ్యులు, స్థానికులు వారిని పట్టుకుని పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. విచారణలో సదరు మహిళలు వైద్యశాఖలో హెల్త్ అసిస్టెంట్‌లనీ, క్రికెట్ బెట్టింగుల్లో రూ.30 లక్షలు అప్పులపాలై దొంగతనానికి యత్నించినట్లు వెల్లడైంది. ఈ విషయం అందర్నీ విస్మయానికి గురిచేసింది. మహిళలు సైతం బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారంటే జిల్లాలో ఏ స్థాయిలో పందేలు సాగుతున్నాయో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- తొలిరోజు 914 మంది గైర్హాజరు



నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు శనివారం తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 79 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. తొలిరోజు 29,102 మంది విద్యార్థులకుగానూ 28,188 మంది హాజరయ్యారు. 914 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐఓ శ్రీనివాసులు స్టోన్‌హౌస్ పేటలోని నారాయణ, శ్రీచైతన్య, విశ్వసాయి, కృష్ణచైతన్య తదితర పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులతో పాటు వచ్చిన తల్లిదండ్రులు బయట పడిగాపులు కాశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పరీక్షా కేంద్రాల సమీపంలోని చెట్లు కింద సేద తీరారు. కేంద్రాల వద్ద తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో మంచినీటి కోసం ఇబ్బంది పడ్డారు.

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా



జేసీబీతో భూమిని చదును చేయిస్తున్న ఆక్రమణదారులు

- టీడీపీ నాయకుల ఇష్టారాజ్యం
- ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమితోపాటు పంట కాలువ ఆక్రమణ
- నాలుగు గ్రామాల రైతుల ఆగ్రహం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేపల్లి నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా ఆక్రమించేస్తున్నారు. విలువైన ప్రభుత్వ భూములపై కన్నేసి రాత్రికి రాత్రే పెద్ద యంత్రాలతో చదును చేసి రూపురేఖలు మార్చేస్తున్నారు. తాజాగా వెంకటాచలం మండలం చవటపాళెం పంచాయతీ అనుపల్లిపాడు వద్ద రూ.2 కోట్ల విలువైన సుమారు మూడెకరాల ప్రభుత్వ భూమిని టీడీపీ నాయకులు దర్జాగా కబ్జా చేయడంపై నాలుగు గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ పరిధిలో అనుపల్లిపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో రహదారికి ఆనుకుని విలువైన ప్రభుత్వ భూమి ఖాళీగా ఉంది. టీడీపీ నాయకులు నాలుగు రోజుల క్రితం యంత్రాలతో సదరు భూమిని, దానికి అనుకుని ఉన్న దశాబ్దాల క్రితం తవ్విన పంట కాలువను పూడ్చి చదును చేశారు. పంట కాలువ రూపురేఖలు లేకుండా చేశారు. సుమారు మూడెకరాలను కబ్జా చేసేశారు. ఆక్రమణలకు గురైన ఈ భూమి జాతీయ రహదారికి కిలోమీటర్ దూరంలో మాత్రమే ఉంటుంది. ఇక్కడ ఎకరా పొలం ధర రూ.70 లక్షలు ఉంటుందని రైతులు చెబుతున్నారు. టీడీపీ నాయకులు కబ్జా చేసిన పంట కాలువ ద్వారానే అనుపల్లిపాడు, నాయుడుపాళెం, జంగాలపల్లి, రామదాసుకండ్రిగ గ్రామాల రైతులకు సాగునీరు విడుదల చేయాల్సి ఉంది. కబ్జా విషయం తెలుసుకున్న రైతులు వెంటనే అక్కడకు చేరుకుని ఆక్రమణదారులతో వాగ్వాదానికి దిగారు. నాలుగు గ్రామాలకు సాగునీరు విడుదల చేసే కాలువను ఎలా పూడ్చివేస్తారని ప్రశ్నించినా వారు లెక్కచేయకుండా పనులు కొనసాగించారు.

పట్టించుకోని అధికారులు?

పంట కాలువను కబ్జా చేస్తున్నారని ఆయా గ్రామాల రైతులు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఈ కాలువను పూడ్చివేస్తే తమ పొలాలు బీడు పెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుందని, వెంటనే ఆక్రమణలు తొలగించి, పంట కాలువను యథావిధిగా ఉంచాలని ఫిర్యాదు చేశారు. అయితే ఏ ఒక్క అధికారి కూడా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. టీడీపీ పెద్దల సహకారంతోనే పంట కాలువను కబ్జా చేసి చదును చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని, లేకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

ఆక్వా సర్వీసులపై దాడులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆక్వా విద్యుత్ సర్వీసులపై విద్యుత్ విజిలెన్స్, ఏపీటీఎస్ విభాగాధికారులు దాడులను చేపట్టారు. కావలి రూరల్ మండలంలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఆరు ఆక్వా సర్వీసులను గుర్తించి కేసు నమోదు చేసి రూ.నాలుగు లక్షల జరిమానాను విధించారు. విద్యుత్ విజిలెన్స్ ఈఈ సుధాకర్, డీఈఈ పరిశుద్ధరావు, వెంకట్రామిరెడ్డి, ఏఈ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు అన్యాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేనేత రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ చేనేత కార్మిక సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు పముజుల హరి ఆరోపించారు. నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. చేనేత రంగానికి బడ్జెట్లో రూ.138 కోట్లను కేటాయించడం దారుణమని, ఇందులో రూ.ఐదు కోట్లే చేనేత సహకార సంఘాలకు ఉపయోగపడతాయని, మిగిలిన మొత్తం అలంకారప్రాయంగా మారనుందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అందజేసిన నేతన్న నేస్తం కంటే మెరుగైన పథకాలను ఇస్తామని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. చేనేత రంగాన్ని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు.

నిమ్మ ధరలు

పెద్దవి : రూ.47
సన్నవి : రూ.35
పండ్లు : రూ.22

మందులకు కొరత తలెత్తకూడదు


మాట్లాడుతున్న సుజాత

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో మందులకు కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ సుజాత సూచించారు. సంతపేటలోని వైద్యశాఖ కార్యాలయంలో ఫార్మసీ అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మందుల సరఫరా, వినియోగం, నిల్వ ఉంచే విధానాలపై జాగ్రత్తలు తీసుకొని వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలని కోరారు. వేసవిలో చిన్నారులకేసే టీకాలకు సంబంధించిన కోల్డ్ చైన్‌ను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, జిల్లా ఎపిడమిక్ అధికారి భాస్కర్, స్టాటిస్టికల్ అధికారి సహన, ఫార్మసీ ఆఫీసర్ రాధమ్మ పాల్గొన్నారు.

మున్సిపల్ డ్రైవర్ల ధర్నా



నెల్లూరు(బారకాసు): నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలో చెత్త వాహనాలు నిలిపే వెహికల్ షెడ్ వద్ద నిరసనను డ్రైవర్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, నగరాధ్యక్షుడు సునీల్‌కుమార్ మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి, ప్రైవేట్ కాంట్రాక్టర్లకు కట్టబెట్టేందుకు చర్యలు చేపట్టడం దారుణమన్నారు. క్రమబద్ధీకరించేంత వరకు ఆందోళనను కొనసాగిస్తామని తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నెల్లూరు నగర కార్యదర్శి అశోక్, లోకేశ్, డ్రైవర్స్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జయకుమార్, మనోజ్, నేతలు శివ, షఫీ, రమేష్, నాగేశ్వరరావు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

94.4 శాతం పింఛన్ల పంపిణీ


కాకుటూరులో దివ్యాంగుడికి నగదును అందజేస్తున్న నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట): సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రారంభమైంది. తొలిరోజు 94.4 శాతం మందికి నగదును పంపిణీ చేశారు. 3,07,232 మంది లబ్ధిదారులకు గానూ 2,90,034 మందికి అందజేశారు. మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్ : రూ.111
లేయర్ లైవ్ : రూ.80
బ్రాయిలర్ చికెన్: రూ.200
స్కిన్‌లెస్ చికెన్: రూ.220
లేయర్ చికెన్: రూ.136

సింహపురిలో అనుపమ పరమేశ్వరన్ సందడి



నెల్లూరు(బృందావనం): నగరంలోని మాగుంట లేఅవుట్లో ఓ సిల్వర్ జ్యువెలరీ స్టోర్‌ను సినీ నటి అనుపమ పరమేశ్వరన్ శనివారం ప్రారంభించారు. అనంతరం అభిమానులతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. నెల్లూరుకు రావడం ఇటీవలి కాలంలో ఇది రెండోసారని, ఇక్కడి చేపల పులుసంటే తనకెంతో ఇష్టమని చెప్పారు. నిర్వాహకులు రవితేజ వేములూరి, ప్రియాంక వేములూరి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పొదలకూరు: పట్టణంలోని దుకాణాల వద్ద భిక్షాటన చేసుకుంటూ మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తి (45) స్థానిక శివాలయ సమీపంలోని శ్మశాన వాటికలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారాన్ని శనివారం అందించారు. సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్సై హనీఫ్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తలపై గాయాలుండటం, రక్తపు మడుగులో పడి ఉండటంతో హత్యగా అనుమానిస్తున్నారు. హిందీ మాట్లాడే సదరు వ్యక్తి రెండేళ్లుగా పట్టణంలో తిరిగేవారని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ ద్వారా ప్రాథమిక ఆధారాలను సేకరించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం



నెల్లూరు(క్రైమ్): రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన వేదాయపాళెం రైల్వేస్టేషన్ సమీపంలో చెన్నై వైపు వెళ్లే పట్టాలపై శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతుడు సుమారు 30 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి.. మెరూన్, నలుపు రంగు చెక్స్ ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బ్లూ రంగుపై తెలుపు డిజైన్ షార్ట్‌ను ధరించి ఉన్నారు. మృతుడి కుడిచేతిపై ఆర్ఏకేయూ అని ఇంగ్లిష్ అక్షరాలతో పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని నెల్లూరు రైల్వే ఎస్సై మాలకొండయ్య పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

బైక్ ఢీకొని వృద్ధుడు..



తోటపల్లిగూడూరు: బైక్ ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన విలుకానుపల్లిలో శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై వీరేంద్రబాబు సమాచారం మేరకు.. విలుకానుపల్లి దళిత కాలనీకి చెందిన గెద్ది శేషయ్య (64) బహిర్భూమి నిమిత్తం గ్రామ సమీపంలోని కోడూరు ప్రధాన రహదారివైపు శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో వెళ్లారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో గాలింపు చర్యలను కుటుంబసభ్యులు చేపట్టారు. కోడూరు ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న పంచాయితీ దొరువులో శేషయ్య పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. నెల్లూరులోని ఓ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించారు. ఘటన స్థలంలో లభ్యమైన ఏటీఎం కార్డుల ఆధారంగా సోతఆములూరుకు చెందిన సుమన్ బైక్ ఢీకొని ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటన స్థలానికి చేరుకొని పోలీసులు విచారణ చేపట్టారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపట్నుంచి ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు

నెల్లూరు (టౌన్): ఏపీ ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలను సోమవారం నుంచి ఈ నెల 15 వరకు జిల్లాలోని 20 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 వరకు నిర్వహించనున్న పరీక్షలకు 3580 మంది అభ్యాసకులు హాజరుకానున్నారు. ఐదు ఫ్లయింగ్.. పది సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు 20 మంది చొప్పున, ఇన్విజిలేటర్లుగా 200 మందిని నియమించారు. సమస్యలుంటే హెల్ప్‌డెస్క్ 83414 08109 నంబర్‌ను సంప్రదించొచ్చు. పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. కాగా పరీక్షల్లో అవకతవకలకు పాల్పడితే యాజమాన్యాలపై చర్యలు తప్పవని డీఈఓ బాలాజీరావు స్పష్టం చేశారు.

వీఎస్‌యూలో 4న జాబ్‌మేళా

వెంకటాచలం: కాకుటూరు సమీపంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో జాబ్‌మేళాను ఏపీఎస్సెస్డీసీ, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం, సీడాప్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్నామని వీసీ అల్లం శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరై ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారని చెప్పారు. 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండి, ఎస్సెస్సీ, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ చదివిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.